
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



రూ. 50 కోట్ల భూమి హాంఫట్



ఖరీదైన మున్సిపల్ స్థలం



- రూ.1.50 కోట్లతో గుట్టుగా లాబీయింగ్
- చక్రం తిప్పిన నంద్యాల అధికార పార్టీ నాయకులు
- కీలకంగా వ్యవహరించిన రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారి
- మున్సిపల్ స్థలానికి బేతంచర్లలో రిజిస్ట్రేషన్
- చక్రం తిప్పిన అధికార పార్టీ కౌన్సిలర్
- ఒకే రోజు 43 డాక్యుమెంట్లతో ప్లాట్లుగా రిజిస్ట్రేషన్లు
- ఖరీదైన 2.30 ఎకరాల మున్సిపల్ స్థలంలో పాగా
- నెలన్నర క్రితం జరిగిన రిజిస్ట్రేషన్ల దందా వెలుగులోకి..

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 10: నంద్యాల మున్సిపాలిటీకి చెందిన దాదాపు రూ.50 కోట్ల విలువ చేసే మున్సిపల్ స్థలాన్ని అధికార పార్టీ నాయకులు హాంఫట్ చేశారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని 2.30 ఎకరాల మున్సిపల్ స్థలాన్ని ఏకంగా ప్లాట్లుగా విభజించి రిజిస్ట్రేషన్లు చేసుకున్న వ్యవహారం దుమారం రేపుతోంది. ఇక్కడి స్థలాన్ని స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటే అడ్డంకులు ఏర్పడతాయన్న ఉద్దేశంతో పథకం ప్రకారం హైటెక్ లాబీయింగ్‌కు తెరలేపారు. బేతంచర్లలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఎనీవేర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో గుట్టు చప్పుడు కాకుండా నెలన్నర క్రితం ఏకంగా 43 డాక్యుమెంట్లను రిజిస్ట్రేషన్లు చేయించారు. అధికార పార్టీకి చెందిన ముఖ్య ప్రజాప్రతినిధి అనుచరుడిని అంటూ నంద్యాలలో ఓ ప్రముఖ గృహ నిర్మాణంలో మౌలిక వసతుల కల్పనకు ఉద్దేశించిన సామగ్రి వ్యాపారం చేసే ఓ వ్యక్తి, అదే పార్టీలో ద్వితీయ శ్రేణి నాయకుడిగా పట్టణంలో చక్రం తిప్పుతున్న మరో వ్యక్తి కలిసి ఈ తతంగానికి తెరలేపారు. మున్సిపల్ స్థలాన్ని



చేజిక్కించుకునేందుకు తెరవెనుక భారీ కుట్రకు ప్లాన్ చేశారు. ఏకంగా రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి మున్సిపల్ కౌన్సిల్‌లోని కొందరు, అధికార యంత్రాంగంలో మరికొందరు ఏకమయ్యారు. రిజిస్ట్రేషన్ శాఖలో కర్నూలులో ఉన్న ఓ కీలక ఉన్నతాధికారి స్థాయి నుంచి కింది స్థాయి వరకు పంపకాల కోసం రూ.1.50 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

బేతంచర్ల నుంచి 'ఎనీవేర్ రిజిస్ట్రేషన్'

నంద్యాల పట్టణంలోని 18వ వార్డు పరిధిలో హౌసింగ్ బోర్డు కాలనీలో గతంలో వివిధ అవసరాల నిమిత్తం పురపాలక శాఖ భూమిని సేకరించింది. అందుకు ప్రతిగా భూమి హక్కుదారులకు అవార్డు పాస్ ద్వారా అప్పట్లో పరిహారం కూడా చెల్లించింది. సర్వే నంబరు 2313/1లో మున్సిపల్ చైర్‌పర్సన్ పేరుతో మీ భూమి పోర్టల్‌లో ఖాతా నంబరు 21100003 పేరుపై 14.42 ఎకరాలు నమోదైంది. ఈ ఆస్తిని దాని సొంతదారు నంద్యాల మున్సిపాల్టీకి సర్వ హక్కులు కల్పిస్తూ వీలునామా రాసి ధారాదత్తం చేశారు. ప్రస్తుతం ఇక్కడ సెంటు స్థలం రూ.20 లక్షలు పైమాటే. ఈ లెక్కన ప్రస్తుతం 2.30 ఎకరాల మున్సిపల్ స్థలాన్ని 43 ప్లాట్లుగా విభజించి ఒకే రోజు రిజిస్ట్రేషన్లు చేయించుకోవడం వెనుక భారీ లాబీయింగ్ జరిగినట్లు తెలుస్తోంది. ఒక పథకం ప్రకారం వీలునామా రాసిన యజమాని వారసుల్లో కొందరు మొదట ఆ స్థలం తమదే అంటూ స్థలాన్ని తాము ఎలాగైనా పొందాలనే ఎత్తుగడతో కొన్ని రకాల పత్రాలు సిద్ధం చేసుకున్నారు. అందుకు తగ్గట్టుగా గతేడాది నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి తమ పేర్లతో రిజిస్ట్రేషన్ చేయాలని కోరారు. ఈ స్థలం విషయంలో కోర్టు వ్యవహారాలు కూడా నడుస్తుండటంతో చట్టబద్ధంగా ఈ ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయడానికి వీల్లేదని నంద్యాల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం అధికారులు తేల్చి చెప్పారు. దీంతో అధికార పార్టీ అనుచరులుగా ఓ సామాజిక వర్గంలో కీలకమైన నాయకుడిని అంటూ హల్‌చల్ చేసే ఓ వైసీపీ నాయకుడు, మరో ద్వితీయ శ్రేణి నాయకుడు సీన్‌లోకి వచ్చారు. మున్సిపల్ స్థలాన్ని ఎలాగైనా చేజిక్కించుకోవాలన్న ఉద్దేశంతో లాబియింగ్‌కు తెరలేపారు.



బేతంచర్ల సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం

చేతులు మారిన రూ.1.50 కోట్లు

దాదాపు రూ.50 కోట్లు విలువ చేసే మున్సిపల్ స్థలం రిజిస్ట్రేషన్‌కు అధికార యంత్రాంగాన్ని, మున్సిపల్ కౌన్సిల్‌లోని కీలక వ్యక్తులను మేనేజ్ చేసేందుకు రూ.1.50 కోట్లకుపైగా చేతులు మారినట్లు విశ్వసనీయ సమాచారం. కౌన్సిల్‌లో అత్యంత కీలకమైన ఓ మహిళ, ఆమె భర్త, అధికార పార్టీలోని ఓ ద్వితీయ శ్రేణి నాయకుడికి, రిజిస్ట్రేషన్ శాఖలో కర్నూలులోని ఓ కీలక ఉన్నతాధికారికి పంపకాలు జరిగిన మొత్తంలో సింహభాగం వారికే సూట్‌కేసుల్లో మోసినట్లు ఆ శాఖలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. నంద్యాల మున్సిపల్ చైర్మన్ పేరిట మ్యుటేషన్ అయినట్లు రికార్డుల్లో ఉన్న స్థలాల పట్ల విలువైన ఆస్తుల వ్యవహారంలో అప్రమత్తంగా ఉండాల్సిన వారే అక్రమార్కులకు సహకరించడం కలకలం రేపింది. వారసులమంటూ తెరపైకి వచ్చిన వారు, కౌన్సిల్‌లోని కీలక మహిళ కుటుంబం ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో, బేతంచర్ల నుంచి అదే సామాజిక వర్గానికి చెందిన అధికారి ద్వారా మున్సిపల్ స్థలాన్ని ఏకంగా 43 ప్లాట్లుగా చేసి గతేడాది డిసెంబరు 20న రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. సాధారణంగా ఎనీవేర్ విధానం ద్వారా ఇతర ప్రాంతానికి చెందిన స్థలాలు, ఆస్తులు మరో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు చేస్తే ఆన్‌లైన్‌లోనే స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అప్రూవల్ చేసేందుకు పంపుతారు. ఈ విషయంలో నంద్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులపై ఆ శాఖలో కర్నూలుకు చెందిన కీలక ఉన్నతాధికారి తీవ్రమైన ఒత్తిడి తెచ్చి అప్రూవల్ తతంగాన్ని పూర్తి చేయించారన్న ఆరోపణలు ఉన్నాయి.

కర్నూలు చిరుద్యోగి కనుసన్నల్లో

నంద్యాల మున్సిపాలిటీకి చెందిన అత్యంత ఖరీదైన స్థలం అన్యాక్రాంతం వెనుక జరిగిన మొత్తం లాబీయింగ్ వ్యవహారంలో కర్నూలు రిజిస్ట్రేషన్ శాఖ కీలక అధికారి వద్ద పని చేసే చిరుద్యోగి కనుసన్నల్లో తెరవెనుక భాగోతం నడిచినట్లు సమాచారం. ఆ చిరుద్యోగి నంద్యాలకు కూతవేటు సమీపంలో ఉన్న బండిఆత్మకూరు మండలానికి చెందిన వ్యక్తి కావడం, ముఖ్యంగా అధికార పార్టీ నాయకులకు అన్నీతానై రిజిస్ట్రేషన్ల వ్యవహారాలు చక్కదిద్దే లాబీయిస్టుగా ఇతనికి పేరు ఉంది. ఈ నేపథ్యంలోనే ఆ చిరుద్యోగి రూ.50 కోట్ల విలువ చేసే మున్సిపల్ స్థలం అన్యాక్రాంతం కుట్రలో రిజిస్ట్రేషన్లు జరిగేందుకు పంపకాల్లో కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కర్నూలుకు చెందిన కీలక అధికారికి రూ.60 లక్షలు, మున్సిపల్ కౌన్సిల్‌లోని ఓ కీలక మహిళకు రూ.30 లక్షలు, ద్వితీయ శ్రేణి నాయకుడికి రూ.30 లక్షలు, మిగతా మొత్తాన్ని రిజిస్ట్రేషన్లకు సహకరించిన కార్యాలయంలోని ఉద్యోగులకు సదరు చిరుద్యోగి పంపకాలు చేసినట్లు తెలుస్తోంది.

రిమార్క్ రాశాను..

బేతంచర్ల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నంద్యాల పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన స్థలం రిజిస్ట్రేషన్ వ్యవహారంపై డిస్‌ప్యూట్ రిమార్క్ రాశాను. రిజిస్ట్రేషన్లకు సంబంధించి కొత్తగా వచ్చిన విధానం ప్రకారం రిజెక్షన్ ఆప్షన్ ఉండదు. రిమార్క్‌లను మాత్రమే పొందుపరచడం జరుగుతుంది.

- సునంద, సబ్ రిజిస్ట్రార్ నంద్యాల

నా దృష్టికి రాలేదు

నంద్యాల మున్సిపల్ స్థలం అన్యాక్రాంతమైన విషయం నా దృష్టికి రాలేదు. కొత్తగా బదిలీపై వచ్చిన విషయం మీకు తెలిసిందే. మున్సిపల్ ఆస్తులకు కచ్చితంగా రక్షణ కల్పిస్తాం. ఈ విషయంపై పూర్తి వివరాలను తెలుసుకొని, చట్టబద్ధమైన చర్యలు తీసుకుంటాం.

- పి.నిరంజన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్





మున్సిపల్ స్థలం

ముందే మొదలైన ఎండలు

- శివరాత్రి రాకముందే తగ్గిన చలి
- భానుడి భగభగలతో అల్లాడుతున్న జనాలు



కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 9: సాధారణంగా శివరాత్రి తర్వాత మార్చి నెల నుంచి ఎండలు మొదలవుతాయి. అయితే.. ఈ ఏడాది శివరాత్రికి ముందే వణికించే చలికి బదులు వేసవి ఎండలు ప్రారంభమయ్యాయి. పొలాల్లో పంట పనులు చేసుకుంటున్న రైతులు, అదే విధంగా గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు మండే ఎండలతో అల్లాడుతున్నారు. ప్రస్తుతం కర్నూలు నగరంలో 37 నుంచి 38.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. కర్నూలు, కల్లూరు, కోడుమూరు, డోన్, ఎమ్మిగనూరు, పాణ్యం, బనగానపల్లె, పత్తికొండ, ఆలూరు, ఆదోని, క్రిష్ణగిరి, బెళగల్, గోస్పాడు తదితర మండలాల్లో సాయంత్రం కూడా ఎండ వేడిమి తగ్గడం లేదు. సాధారణంగా శివరాత్రికి ముందు రోజులు చలి ఎక్కువగా ఉంటుంది. ఈసారి మాత్రం చలి అన్నమాటే లేదు. ఉదయం 9 గంటల సమయానికే ఎండ వేడిమి ఎక్కువ అవుతోంది. ఫిబ్రవరిలోనే ఈ పరిస్థితి నెలకొనడంతో ఇక ముమ్ముందు మార్చి, ఏప్రిల్, మే నెలల్లో ఇంకెంత వేడిమిని భరించాల్సి వస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది వేసవిలో తొలుత మోస్తరు వేడి, ఆ తర్వాత తీవ్రమైన ఎండలతో వడగాల్పులు వీస్తాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఎల్‌నినో ప్రభావంతోనే ఈ పరిస్థితి..

ఈ ఏడాది వేసవిలో మొదట ఓ మోస్తరు వేడి మొదలై ఆ తర్వాత క్రమేపి తీవ్ర వడగాల్పులు వీస్తాయని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం తీవ్ర ఎండలు ఉంటాయని, వాతావరణ శాఖ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. ప్రస్తుతం పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో తీవ్రంగా ఉన్నందున ఆ ప్రభావంతో ఎండలు ఎక్కువ ఉంటాయని అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ తర్వాత ఎల్‌నినో బలహీన పడి తటస్థ పరిస్థితులు ఏర్పడే క్రమంలో పసిఫిక్ మహా సముద్రంలో వేగంగా వాతావరణ పరిస్థితులు ఏర్పడి సెప్టెంబరు నాటికి లామినా పరిస్థితులు నెలకొంటాయని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభం నాటికి మరింత బలపడిన ఎల్‌నినో మే, జూన్ నుంచి బలహీనపడి తొలుత కొంత మేర తటస్థంగా ఆ తర్వాత ఎండల ప్రభావం తగ్గుతుందని అన్నారు. వచ్చే నైరుతి సీజన్‌లో వర్షాల పరిస్థితిని ఇప్పుడే అంచనా వేయలేమని ఐఎండీ మాజీ డైరెక్టర్ జనరల్ రాజీవన్ వివరించారు.

లోకేశ్ శంఖారావం

- సీఎం జగన్ అరాచకాలపై పర్యటన
- బాధిత ప్రజలకు భరోసా ఇచ్చేందుకే: మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి



బనగానపల్లె, ఫిబ్రవరి 10: సీఎం జగన్ అవినీతి, అరాచక పాలనకు వ్యతిరేకంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన కార్యక్రమమే శంఖారావం అని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం బనగానపల్లె టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే బీసీ మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ పర్యటించని నియోజకవర్గాల్లో శంఖారావం పేరుతో పర్యటించి సీఎం జగన్ ప్రభుత్వ దౌర్జన్యాలు, అవినీతి పాలనను ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలకు తెలియజేస్తారన్నారు. నిరుద్యోగంతో యువతీ యువకులు ఇబ్బందులు పడుతున్నారని, ధరల పెరుగుదలతో రాష్ట్ర ప్రజలు సతమతమవుతున్నారని అన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రజలకు భరోసా కల్పించేందుకు టీడీపీ శంఖారావం అనే కీలక ప్రచారానికి నారాలోకేశ్ శ్రీకారం చుట్టారని అన్నారు. ఒకరోజులో మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో శంఖారావం కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల్లోని ప్రజల సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. బాబు ష్యూరిటీ, భవిష్యత్ గ్యారెంటీ పథకాలైన సూపర సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. జగన్ పాలనలో బాధితులుగా మారిన అన్ని వర్గాల ప్రజలకు లోకేశ్ భరోసా ఇవ్వనున్నట్లు బీసీ తెలిపారు.

ఎన్నికల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం


నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 10: రానున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పటిష్ట ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ముఖేష్‌కుమార్ మీనాకు నివేదించారు. శనివారం ఎలక్షన్ కమిషన్ కార్యాలయం నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఎన్నికల నిర్వహణ సంసిద్ధతపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి కలెక్టర్ డా. కె. శ్రీనివాసులుతోపాటు డీఆర్వో పద్మజ, అన్ని నియోజకవర్గాల ఈఆర్‌ఓలు, కలెక్టరేట్ ఎన్నికల విభాగపు అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు పటిష్ట ప్రణాళికలు రూపొందించినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు నివేదించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ త్వరలో సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలని అన్ని జిల్లా కలెక్టర్లకు సూచించారు. ఎన్నికల నిర్వహణకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసుకోవాలని కలెక్టర్లను సూచించారు. కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న క్లెయింలన్నీ క్లియర్ చేయాలని ఈఆర్‌ఓలను ఆదేశించారు. వీడియో, స్టాటికల్ సర్వేలైన్, ఎంసీసీ తదితర టీంలన్నీ బుధవారంలోగా పూర్తి చేయాలని డీఆర్వోను కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో నంద్యాల, ఆత్మకూరు, డోన్ ఆర్డీఓలు, నియోజకవర్గాల ఈఆర్వోలు, నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ డీఆర్వో, ఎన్నికల అధికారులు

వైసీపీ కౌన్సిలర్ల తిరుగుబాటు

- రంగంలోకి దిగిన ఐ ప్యాక్ బృందం
- ఫోన్లు చేసి ఆరా తీస్తున్న వైనం



ఆత్మకూరు, ఫిబ్రవరి 10: అధికార వైసీపీలోని కొంత మంది కౌన్సిలర్లు అసంతృప్తితో రగిలిపోతున్నారు. త్వరలోనే వీరు ఆ పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై ఈ నెల 8వ తేదీన ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన 'తిరుగుబాటుకు సిద్ధం' అనే కథనం ఆ పార్టీలో కలకలం రేపింది. ఎన్నికల సమీపిస్తున్న వేళ మెజార్టీ సంఖ్యలో కౌన్సిలర్లు వైసీపీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లు ప్రచారం జోరందుకోవడంతో ఐ-ప్యాక్ బృందం రంగంలోకి దిగింది. అసలు వైసీపీ కౌన్సిలర్లలో అసంతృప్తులు నిజమేనా.. ఏఏ కారణాల వల్ల కౌన్సిలర్లు తిరుగుబాటు చేయాల్సిన పరిస్థితులు వచ్చాయి.. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వ్యవహార శైలి ఎలా ఉంది.. పార్టీలో కౌన్సిలర్లకు జరిగిన అవమానాల్లేంటి.. ఏం చేస్తే తిరిగి పార్టీలో కొనసాగుతారు.. అనే అంశాలపై పలువురు కౌన్సిలర్లకు ఫోన్లు చేసి ఆరా తీసినట్లు తెలిసింది. అయితే ఫోన్లలో మాట్లాడితే రికార్డులు చేస్తారన్న ఉద్దేశంతో ఎలాంటి సమాచారం ఇవ్వకుండా నేరుగా కలిస్తే జరిగిన విషయాలు వెల్లడిస్తామని చెప్పినట్లు తెలుస్తోంది. మరికొందరు కౌన్సిలర్లు మాత్రం తమకు జరిగిన అవమానాలను తెలియజేసి ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. చివరకు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ మారూఫ్ ఆసియా తండ్రి, కోఆప్షన్ సభ్యుడు ఎంఏ రషీద్‌కు కూడా వారు ఫోన్ రావడంతో తన వద్దకు నేరుగా వస్తే జరిగిన విషయాలన్నీ వివరిస్తానని చెప్పినట్లు తెలిసింది. అలాగే కొందరు వైసీపీ అనుకూల కౌన్సిలర్లు మాత్రం ఇవన్నీ మామూలేనని చెప్పే ప్రయత్నం చేశారు. మొత్తానికి అధికార వైసీపీలోని కౌన్సిలర్లను నిలుపుకునేందుకు ఆ పార్టీ నాయకులు పడుతున్నట్లు స్పష్టమవుతోంది. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తిరుబాటు కౌన్సిలర్లను బుజ్జగించేందుకు పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఎవరెన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ పలువురు కౌన్సిలర్లు పార్టీని వీడేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఇప్పటికే టీడీపీ నాయకులతో చర్చలు జరిపి ఆ పార్టీలోకి చేరేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

నిలిచిన నీటి పథకం పనులు



శిల్పా ఎస్టేట్‌లో నిర్మాణంలో ఉన్న ఓహెచ్‌ఆర్ ట్యాంకు



పంప్‌హౌస్ దగ్గర పునాదులకే పరిమితమైన ఓహెచ్‌ఆర్ ట్యాంకు పనులు

- నిధులు ఇవ్వని వైసీపీ ప్రభుత్వం
- నిర్మాణాలు పూర్తిగాని ఓహెచ్‌ఆర్ ట్యాంకులు
- సర్వేకే పరిమితమైన పైపులైన్

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 10: ఎమ్మిగనూరు పట్టణ ప్రజల దాహార్తిని తీర్చేందుకు గత టీడీపీ ప్రభుత్వం రూ.148.04 కోట్లతో మంచినీటి పథకాన్ని 2019లో మంజూరు చేసింది. ఈ పథకం ద్వారా జీడీపీ (గాజులదిన్నె ప్రాజెక్టు) నుంచి పైపుల ద్వారా నీటిని ఎమ్మిగనూరు సరఫరా చేయాల్సి ఉంది. అయితే అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం ఈ పనులను అటకెక్కించింది. నిధులు ఇవ్వకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పథకం స్వరూపం..

ఎమ్మిగనూరు పట్టణంలో వేసవిలో తాగునీటి ఎద్దడిని తీర్చేందుకు గోనెగండ్ల మండలంలోని జీడీపీ(గాజులదిన్నె ప్రాజెక్టు) నుంచి ఎమ్మిగనూరు పట్టణానికి పైపుల ద్వారా నీటిని మళ్లించాలి. ఇందులో భాగంగా 22 కి.మీ. మేర పైపులైను, ఎమ్మిగనూరు పట్టణంలో మైనార్టీ కాలనీ, శిల్పా ఎస్టేట్, శివన్న నగర్‌లోలలో ఒక్కో ఓహెచ్ ఆర్ ట్యాంకు, గుడికల్ రోడ్డులోని పంప్ హౌస్ దగ్గర రెండు ఓహెచ్‌ఆర్ ట్యాంకులు నిర్మించాలి. అలాగే పట్టణంలో గృహాలకు నీటి సరఫరా కోసం 100 కి.మీ. మేర పైప్ లైన్లు ఏర్పాటు చేయాలి. అంతేగాక గాజులదిన్నె ప్రాజెక్టు దగ్గర నీటిని మళ్లించేందుకు ఒక ఇన్‌టె క్ వెల్ ఏర్పాటు చేయాలి.

నిధుల మంజూరు

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మిగనూరు పట్టణానికి వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ఉండేందుకు అప్పటి ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి చొరవతో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమగ్ర మంచినీటి సరఫరా వ్యవస్థ ఏర్పాటుకు ప్యాకేజీ 1, 2 కింద రూ. 148.04 కోట్ల అంచనా విలువతో పథకాన్ని మంజూరు చేశారు. దీంతో 27.02.2019న అప్పటి ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అయితే అనూహ్యంగా 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారం కోల్పోవటం, ఎమ్మిగనూరులో ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి ఓటమి చెందటంతో పథకం నిర్మాణం ప్రశ్నార్థకంగా మారింది.

పూర్తి చేయటం మరచిన వైసీపీ ప్రభుత్వం

టీడీపీ ప్రభుత్వ హయాంలో 2019లో మంజూరైన పథకాలను రీ టెండర్ పేరుతో వైసీపీ ప్రభుత్వం నిలిపివేసింది. ఇందులో భాగంగా ఎమ్మిగనూరులో సైతం నీటి పథకాన్ని నిలిపివేసింది. పథకం నిలిపివేయటం పట్ల తీవ్ర విమర్శలు రావటంతో 3.10.2020న తిరిగి పనులను ప్రారంభించింది. అయితే నిధుల విడుదలలో జాప్యం, నిర్లక్ష్యం కారణంగా 40 నెలలు గడుస్తున్నా పథకం పూర్తి చేయలేకపోయింది.

పనులు పది శాతమే పూర్తి

రూ.148.04 కోట్లతో ప్రారంభమైన మంచినీటి పథకం పనులు 40 నెలల్లో 10 శాతం మాత్రమే పూర్తయ్యాయి. మెగా కంపెనీ రూ.86 కోట్లతో చేపట్టిన పనుల్లో ఇప్పటి వరకు రూ.5 కోట్లతో 8.3శాతం పనులు జరిగాయి. రూ.61 కోట్లతో ఐహెచ్‌పీ చేపట్టిన పనుల్లో రూ.కోటితో 2.2 శాతం పనులు జరిగాయి. పట్టణంలోని మైనార్టీ కాలనీ, శిల్పి ఎస్టేట్, పంప్‌హౌస్ దగ్గర నిర్మిస్తున్న మూడు ఓహెచ్‌ఆర్ ట్యాంకుల పనులు అసంపూర్తిగా ఉన్నాయి. శివన్న నగర్, పంప్ హౌస్ దగ్గర రెండు ట్యాంకులు మధ్యలో నిలిచిపోయాయి. ఇక జీడీపీ నుంచి పైపులైన్ పనులు సర్వేకే పరిమితమయ్యాయి.

నిధుల లేమితో నిలిచిన పనులు

వైసీపీ ప్రభుత్వం పనులకు సంబంధించి బిల్లులను విడుదల చేయకపోవటంతో పనులను నిలిపివేశారు. ఇప్పటి వరకు దాదాపు రూ.6 కోట్ల మేర బిల్లులు విడుదల చేయాల్సి ఉంది. దీంతో కాంట్రాక్టర్లు ఎక్కడ పనులు అక్కడే నిలిపేశారు. దీన్ని బట్టి చూస్తే తాగునీటి పథకం పనులకు పూర్తి చేయటంలో వైసీపీ ప్రభుత్వానికి ఏమేరకు చిత్తశుద్ధి ఉందో ఇట్టే అర్థమవుతోంది.

75 శాతం పనులు పూర్తయ్యాయి

జీడీపీ నుంచి సమగ్ర మంచినీటి సరఫరా పథకానికి సంబంధించి ఓహెచ్‌ఆర్ ట్యాంకుల పనులు 75 శాతం పూర్తయ్యాయి. ఇక పైపులైన్లకు సంబంధించి ఇతర సామగ్రి అంతా వచ్చింది. కాంట్రాక్టర్లు బిల్లుల కోసం వేచి చూస్తున్నారు. బిల్లులు వచ్చిన వెంటనే పనులు పూర్తి చేస్తారు.

- గంగిరెడ్డి, మున్సిపల్ కమిషనర్, ఎమ్మిగనూరు

పోక్సో కేసు నమోదు



నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు

దేవనకొండ, ఫిబ్రవరి 10: దేవనకొండకు చెందిన ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు .. దేవనకొండకి చెందిన 14 ఏళ్ల తమ బాలిక కనపడటం లేదని, ఈనెల 6న తల్లిదండ్రులు స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పెళ్లి చేసుకుంటానని బాలికకు అమాయకపు మాటలు చెప్పి నిందితుడు తన బైక్‌పైన కిడ్నాప్ చేసి తీసుకెళ్తుండగా, కర్నూలు -బళ్లారి రహదారిపై గడ్డేరాళ్ల బస్ స్టాప్ వద్ద శనివారం తమ సిబ్బందితో కలసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. బాలిక స్టేట్‌మెంట్ ఆధారంగా నిందితుడిపై కిడ్నాప్, పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. కిడ్నాప్‌కు ఉపయోగించిన బైక్‌ను సీజ్ చేశామని అన్నారు.

నంద్యాల ఏఎస్పీగా ప్రవీణ్‌కుమార్



ఎస్పీని కలిసిన ఏఎస్పీ ప్రవీణ్‌కుమార్

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 10 : నంద్యాల జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)గా కె.ప్రవీణ్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కడప జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగంలో డీఎస్‌ఈవోగా విధులు నిర్వర్తిస్తూ నంద్యాల జిల్లా ఏఎస్పీగా బదిలీ అయ్యారు. జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఆయన ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్పీ రఘువీర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

బొజ్జమ్మ డ్రైవర్‌పై ఎస్సీ కేసు నమోదు

దేవనకొండ, ఫిబ్రవరి 10 : కప్పట్రాళ్ల బొజ్జమ్మ డ్రైవర్ ఇమామ్‌సాపై ఎస్సీ కేసు నమోదు చేసిన్నట్లు దేవనకొండ సీఐ శ్రీనివాసులు తెలిపారు. జిల్లెలబుడకల గ్రామ సచివాలయంలో పని నిమిత్తం వెళ్లిన ఇమామ్‌సా పంచాయతీ కార్యదర్శి శివశంకర్ సింగ్‌తో వాగ్వాదానికి దిగాడు. దీని కొనసాగింపుగా కార్యదర్శిపై దాడి చేయబోతుండగా గ్రామానికి చెందిన హరిస్వామి అడ్డుపడ్డాడు. దీంతో హరిస్వామిపై ఇమామ్‌సా రెచ్చిపోయి దాడి చేయడమేగాక కులం పేరుతో దూషించాడు. బాధితుడు హరిస్వామి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఇమామ్‌సాపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కుంభాభిషేకం వేడుకలు ప్రారంభం



బనగానపల్లె, ఫిబ్రవరి 10: బనగానపల్లె మండలంలోని ప్రముఖ శక్తి క్షేత్రమైన నందవరం చౌడేశ్వరీమాత కుంభాభిషేక వేడుకలు ఆలయ ఈవో రామానుజన్ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాను. ఉదయం మహాగణపతి పూజ, రక్షాబంధనం, ఆచార్యాది రుత్విక్ వరణం, మాతృకాపూజ, యాగశాల ప్రవేశం, వాస్తుహోమం, చండీ పారాయణం నిర్వహించారు. సాయంత్రం అంకురార్పణం, అగ్ని ప్రతిష్ఠ, దీక్షాహోమం, లలితా సహస్ర నామపారాయణం నిర్వహించారు.

జగన్ రెడ్డి అరాచకాలపై లోకేశ్ శంఖారావం



కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 10: గడిచిన నాలుగేళ్ల 9 నెలల పాలనలో జగన్‌మోహన్ రెడ్డి అరాచకాలపై నారా లోకేశ్ ఈ నెల 11 నుంచి శంఖారావం పూరించనున్నారని ఎమ్మెల్సీ, జిల్లా టీడీపీ అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. శనివారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత విపరీతమైన పన్నుల భారం, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, ఎక్కడ చూసినా నిరుద్యోగ యువత నిరాశ, నిస్పృహలతో రోడ్డు పాలు కావడం, గంజాయిలాంటి వాటికి బానిసలు కావడం, అనునిత్యం మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, పన్నుల భారం, ప్రతిపక్ష పార్టీ నాయకులపై దాడులు, అక్రమ అరెస్టులు, కూల్చివేతల వంటి అప్రజాస్వామిక విధానలతో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. వారందరికి మనో ధైర్యాన్ని కల్పించేందుకు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ గత సంవత్సరం జనవరి 27న కుప్పం నుంచి యువగళం పాదయాత్ర ప్రారంభించి సుమార్ 3,123 కి.మీ. కొనసాగించారని అన్నారు. యువగళం పాదయాత్రలో పర్యటించకని నియోజకవర్గాల్లో శంఖారావం పేరుతో ప్రచారానికి ఆదివారం నుంచి శ్రీకారం చుట్టారని తెలిపారు.

ఫ్లెక్సీలు చింపడం
పిరికి చర్య

టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి



సీఐకి ఫిర్యాదు చేస్తున్న సుబ్బారెడ్డి

డోన్, ఫిబ్రవరి 10: డోన్ పట్టణంలో టీడీపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపివేయడం పిరికి చర్య అని సుబ్బారెడ్డి విమర్శించారు. శనివారం పట్టణంలోని పోలీసు స్టేషన్‌లో సీఐ ప్రవీణ్ కుమార్‌ను కలిసి ఫ్లెక్సీలను చించివేయడంపై ఫిర్యాదు చేశారు. అనంతరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ టీడీపీ మేనిఫెస్టోతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశామన్నారు. గత నెల 23న టీడీపీ ఫ్లెక్సీలను చించారని, మళ్లీ శుక్రవారం పట్టణంలోని టీడీపీ ఫ్లెక్సీలను చించివేయడం బాధాకరమన్నారు. పట్టణంలో సీసీ కెమెరాలు ఉన్నందున ఫ్లెక్సీలు చించిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఫ్లెక్సీలు ఎవరు చించారో తమకు తెలుసన్నారు. వారు భవిష్యతలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మురళీక్రిష్ణగౌడు, సీఎం శ్రీనివాసులు, శ్రీనివాసులు యాదవ్, ఆలా మల్లికార్జున రెడ్డి, మధుసూదన్‌గౌడు, చక్రపాణిగౌడు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు చించివేయడం తగదు

డోన్ పట్టణంలో ఫ్లెక్సీలు చించివేయడాన్ని తీవ్ర ఖండిస్తున్నామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ అన్నారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటటీ కార్యక్రమాలకు సంబందించి మేనిఫెస్టో ఫ్లెక్సీలు ప్రజలను ఆకట్టుకుంటున్నాయని, ఓర్వలేకనే ఫ్లెక్సీలను చించేస్తున్నారని విమర్శించారు.

రేపు స్పందన

కర్నూలు (కలెక్టరేట్), ఫిబ్రవరి 10: కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ డాక్టర్ జి. సృజన శనివారం ఒక ప్రకటనలో తెలపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలు, డివిజన్ స్థాయిలో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని ప్రజల వినియోగించుకోవాలని సూచించారు.

నేటి నుంచి విద్యావైజ్ఞానిక ప్రదర్శనలు

కర్నూలు(ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 10: 2022-23 విద్యాసంవత్సరానికి గాను జిల్లా స్థాయి విద్యావైజ్ఞానిక ప్రదర్శన ఈనెల 11, 12 తేదీలలో ఏర్పాటు చేసినట్లు డీఈవో సామ్యూల్ శనివారం తెలిపారు. కర్నూలు నగరంలోని శ్రీరామ నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో ఏర్పాటు చేశామన్నారు. ఈ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనకు జిల్లాల్లోని వివిధ పాఠశాలల నుంచి 163 ప్రాజెక్టు పాల్గొంటున్నట్లు తెలిపారు. పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు విద్యార్థి కలిసి ప్రాజెక్టులను ప్రదర్శిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని ఢిల్లీ నుంచి వచ్చిన ప్రత్యేక పరిశీలకులు పర్యవేక్షిస్తారని అన్నారు. ప్రతి పాఠశాల నుంచి ప్రాజెక్టులు తయారు చేయాలన్నారు. ఇందులో ఎవరికీ మినహాయింపు లేదన్నారు. మరిన్ని వివరాల కోసం జిల్లా సైన్స్ అధికారి రంగమ్మ సెల్ నెంబర్ 8790111331 సంప్రదించాలన్నారు.

రాఘవరాయడికి స్వర్ణ కవచ సమర్పణ సేవ

మంత్రాలయం, ఫిబ్రవరి 10: వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల మధ్య రాఘవ్రేందస్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణ సేవ రమణీయంగా చేశారు. శనివారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు.

పేదల ఆస్తిని కూడా వదలని ఎమ్మెల్యే

- టీడీపీ మైనారిటీ నాయకుడు ఉమ్మి సలీం



భూమి కోల్పోయిన బాధితులతో కలసి విలేకరులతో మాట్లాడుతున్న మైనారిటీ నాయకుడు

ఆదోని (అగ్రికల్చర్), ఫిబ్రవరి 10: పేదలకు వారసత్వంగా వచ్చిన ఆస్తిని వారి సంతకాలు లేకుండానే ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి తన కుమారుడు, కూతురు పేరున రిజిస్టర్ చేసుకొని కాజేశారని టీడీపీ మైనారిటీ నాయకుడు ఉమ్మి సలీం ఆరోపించారు. శనివారం తన నివాసంలో భూమిని కోల్పోయిన బాధితులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోసిగి ఖాజా హుస్సేన్ అనే వ్యక్తికి శంషుద్దీన్, పరీసాబీ, మేరాజ్ బీ అనే ముగ్గురు వారసులన్నారు. వీరికి ఆదోని శివారు ప్రాంతంలోని బసాపురం సరిహద్దులోని పర్వతాపురం రహదారిలో సర్వే నంబర్ 112సీ-1లో 5.29 ఎకరాల పొలం ఉందని తెలిపారు. ఖాజా హుస్సేన్ తన వీలునామాలో వారసుడైన శంషుద్దీన్‌కి మూడు ఎకరాలు, కుమార్తెలు పరీసాబీ, మేరాజ్‌బీలకు 2.29 ఎకరాలు చెందుతుందని పొందుపరిచారన్నారు. ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి వీరి స్థలాన్ని కుమార్తె గౌతమి రెడ్డి, జయ మనోజ్ రెడ్డిల పేరుపై పరీసాబీ, మేరజ్‌బీ సంతకాలు లేకుండానే రిజిస్టర్ చేసుకున్నారని అన్నారు. తమ అధికారాన్ని వినియోగించుకొని శంషుద్దీన్‌తో కలిసి మిగతావారి సంతకాలు లేకుండానే రూ.కోట్ల విలువ చేసే స్థలాన్ని కాజేశారని ఆరోపించారు. బాధితులు రోజువారి కూలీలని, పనికిపోతేనే వారికి పూట గడుస్తుందని అన్నారు. పేదల భూములని కాజేసి వారి పొట్ట కొడుతున్నారని అన్నారు. బాధితులు మాట్లాడుతూ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి ఇంటికి వెళ్లి న్యాయం చేయాలని కోరితే.. నాలుగేళ్లుగా తనకు సంబంధం లేదని గడప కూడా ఎక్కనియ్యడం లేదన్నారు. వారం రోజుల్లోపు తమకు న్యాయం చేయకపోతే మసీదు, దేవాలయం, చర్చిల ముందు భిక్షాటన చేస్తామన్నారు.

తాగేనీటితో పొలం పండిస్తున్నారు

బసాపురం ఎస్ఎస్ ట్యాంకు నుంచి పట్టణానికి తాగునీరు సరఫరా కాకుండా అధికార దుర్వినియోగంతో కొందరు తమ పొలానికి పైప్‌లైన్ లీకేజీ చేసుకొని మిరప పండిస్తున్నారని మైనారిటీ నాయకుడు ఉమ్మి సలీం ఆరోపించారు. దీనిపై న్యాయపోరాటం చేస్తామన్నారు.

పడిలేచిన కెరటంలా..

- వేళ్లతో సంబంధం లేకుండా చిగురించిన కొబ్బరి చెట్టు
- రుద్రకోడూరు క్షేత్రంలో అరుదైన దృశ్యం



విరిగిపడిన కాండంలో మొలకెత్తిన కొబ్బరిచెట్టు

ఆత్మకూరు, ఫిబ్రవరి 10: ప్రకృతిలో అనేక అద్భుతాలు జరుగుతుంటాయి. అయితే పలు సందర్భాల్లో అవి స్ఫూర్తిదాయకమైన సందేశాన్ని ఇస్తాయి. ఓ వృక్షం విరిగి పడి వేళ్ల నుంచి దూరమైనా పడిలేచిన కెరటంలా తిరిగి చిగురించింది. సహజంగా ఒక మొక్క మొలకెత్తాలంటే.. విత్తు భూమి పొరల్లో నుంచి చీల్చుకొచ్చి పెరగడం పరిపాటి. అయితే ఇందుకు భిన్నంగా నల్లమలలోని రుద్రకోటేశ్వర క్షేత్రంలో వేళ్లతో సంబంధం లేకుండా ఓ కొబ్బరి చెట్టు పెరగడాన్ని చూస్తే ఎవరైనా ఆశ్చర్యానికి గురికాక తప్పదు. ఆత్మకూరు అటవీ డివిజన్ పరిధిలోని రుద్రకోటేశ్వర క్షేత్రంలో కొనేరులో నుంచి బయటకు వచ్చే జలాల పక్కనే ఓ కొబ్బరి చెట్టు ఉండేది. అయితే ఆ చెట్టు కొన్నేళ్ల క్రితం విరిగిపడింది. చెట్టు వేళ్ల నుంచి విరిగిపడిన కాండం కొంత దూరంలో ఉంది. దీంతో చెట్టు వేర్లతో ఉన్న భాగం పూర్తిగా కుళ్లిపోయి ఎండిపోయింది. అయితే విరిగి పడిన చెట్టు కాండం అంచుల్లో నుంచి కొబ్బరి మొక్క పునర్జీవం పొంది పెరగడం విశేషం. క్షేత్రానికి వచ్చిన భక్తులు ఈ దృశ్యాన్ని చూసి ఆశ్చర్యానికి లోనవుతున్నారు.

రంగస్థలం తల్లిపాల వంటిది



టీజీవీ కళాక్షేత్రంలో జబర్దస్త్ కళాకారులను పరిచయం చేస్తున్న కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య

సినీ నటుడు పృథ్వీ

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 10: రంగస్థల నటన తల్లిపాల వంటిదని, సినిమా రంగ నటన పోతపాలు వంటిదని సినీ నటుడు పృథ్వి అన్నారు. శనివారం రాత్రి నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో పృథ్వి, జబర్దస్త్ ఫేం కళాకారులతో నిర్వహించిన కామెడీ షో అసాంతం ప్రేక్షకులను అలరింపజేసింది. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించిన పృథ్వీ మాట్లాడుతూ రంగస్థల కళకు, సినీ రంగ కళకు చాలా తేడా ఉందని అన్నారు. సినిమా రంగంలో నటుడు ప్రభాకర్‌రెడ్డి గురువుగా భావిస్తానని, నటకు స్వచ్ఛంగా, గంభీరంగా పలికే గాత్రం ముఖ్యమని చెప్పారు. ఇటీవల కాలంలో సినిమా రంగం వివిధ కొత్త పుంతలు పోతోందని, తరిగిపోతున్న నాటక రంగానికి మళ్లీ మహర్దశ ప్రాప్తిస్తుందని అన్నారు. గత యాభై ఏళ్లుగా నాటక రంగంలో రాణిస్తున్న టీజీవీ కళాక్షేత్రం కళాకారులను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. అదేవిధంగా సినిమాల్లోని కొన్ని డైలాగులు చెప్పి ప్రేక్షకులను అలరింపజేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ ప్రేక్షకులకు వినోదాన్ని పంచేందుకు విభిన్న కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. ఇందులో భాగంగా జబర్దస్త్ ఫేం కళాకారులతో వినోదభరిత కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకుడు హర్షద్ షేక్, రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు ఆర్వే రామకృష్ణ, జబర్దస్త్ కళాకారులు నవీన్, మోహన్, జై రమేష్, శ్రీకళ తదితరులు పాల్గొన్నారు. హాస్య వల్లరి కార్యక్రమం కళాకారులు ప్రదర్శించిన స్కిట్లు ప్రేక్షకులను కడుపుబ్బ నవ్వించాయి. కార్యక్రమానికి కాపు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోనేటి వెంకటేశ్వర్లు, టీజీవీ కళక్షేత్రం సభ్యులు సంగా ఆంజనేయులు, లక్ష్మీకాంతరావు, క్రిష్టఫర్, శ్రీనివాసరెడ్డి తదితరులు హాజరయ్యారు.

చెక్కు పంపిణీ

పాణ్యం, ఫిబ్రవరి 10: వైఎస్సార్ ఆసరా చెక్కును ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పొదుపు సంఘాలకు అందజేశారు. శనివారం పాణ్యంలోని వీరనారాయణ స్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యేతోపాటు సెర్ప్ సీఈవో మహమ్మద్ ఇంతియాజ్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పాణ్యం మండలంలోని 750 సంఘాలలోని 8372 మందికి రూ. 17. 12 కోట్లు రుణమాఫీ చేశామని చెప్పారు. నాలుగో విడత కింద రూ. 4.28 కోట్ల చెక్కును సీఈవో చేతుల మీదుగా స్వయం సహాయ సంఘాలకు అందజేశారు. సీఈవో మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి పొందే లబ్ధితో జీవనోపాదులు ఏర్పాటు చేసుకోవాలని, అలాగే రుణాలు సక్రమంగా చెల్లించాలని సూచించారు. ఏపీఎం ప్రసాద్, ఎంపీపీ ఉశేన్‌బీ, ఎంపీడీవో భాగ్యలక్ష్మి, సర్పంచ్ పల్లవి, ఎంఎస్ఎస్ అధ్యక్షురాలు సరళమ్మ, కోఆప్షన్ సభ్యులు జాకీర్ హుశేన్, మాజీ జడ్పీటీసీ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్‌లు, వైకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

'కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలి'



సెర్ప్ సీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న వీవోఏలు

పాణ్యం, ఫిబ్రవరి 10: కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని వీవోఏలు శనివారం సెర్ప్ సీఈవో మహమ్మద్ ఇంతియాజ్‌ను కోరారు. ఆసరా కార్యక్రమానికి వచ్చిన ఆయనకు వినతి పత్రం అందజేశారు. వీవోఏలు మాట్లాడుతూ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం కల్పించాలన్నారు. రాజకీయ జోక్యాన్ని నివారించాలన్నారు. కార్యక్రమంలో వీవోఏల సంఘం జిల్లా నాయకులు భాస్కర్, పెద్దరాజు, విల్సన్‌బాబు, రామలక్ష్మి, చంద్రావతి, రజని, మహాలక్ష్మి, శారద పాల్గొన్నారు.

'పీవీ జీవిత చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలి'

పాణ్యం, ఫిబ్రవరి 10: మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవిత చరిత్రను పాఠ్యాంశంలో చేర్చాలని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్ నాయుడు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ తెలుగు జాతి గర్వించేలా భారతరత్న లభించడం హర్షణీయమన్నారు. ప్రధానిగా నంద్యాల నుంచి పార్లమెంట్‌కు ఎన్నికై దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసిన వ్యక్తి పీవీ అని కొనియాడారు.

మున్సిపల్ వర్కర్ మృతికి ప్రముఖుల నివాళి



నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకుడు జయసూర్య

నందికొట్కూరు ఫిబ్రవరి 10: మున్సిపల్ వర్కర్ దేవదాసు అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం ఉదయం మారుతి నగర్‌లోని ఆయన నివాసం వద్ద భౌతిక కాయానికి పలువురు నివాళి అర్పించారు. నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ జయసూర్య, ముస్లీం మైనార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి షకీల్ అహ్మద్, కౌన్సిలర్ మొల్లా జాకీర్ తదితరులు నివాళి అర్పించారు.

మున్సిపల్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ



హరిప్రసాద్

ఆత్మకూరు, ఫిబ్రవరి 10: ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌గా డి.హరిప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల బదిలీల్లో భాగంగా ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న పెనుగొండ శ్రీనివాసరావును కడప మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో కళ్యాణదుర్గం మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న డి.హరిప్రసాద్‌ను ఆత్మకూరు మున్సిపాలిటీ కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ నియమించారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు కార్యాలయ సిబ్బంది, పలువురు కౌన్సిలర్లు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పాండురంగాపురంలో 'పల్లెకు పోదాం'



మాజీ సైనికులను సన్మానిస్తున్న నాయకులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 10: మండలంలోని పాండురంగాపురం గ్రామంలో శనివారం బీజేపీ నాయకులు 'పల్లెకు పోదాం' కార్యక్రమాన్ని నిర్వహించారు. బీజేపీతోనే దేశం అన్ని రంగాలలో అభివృద్ధి సాధించిందని బీజేపీ నంద్యాల నియోజకవర్గ కన్వీనర్ అభిరుచి మధు అన్నారు. ఆదర్శ గ్రామ రైతన్నల ఆలోచనలు, రైతుల సమస్యలు పట్టించుకునే ప్రభుత్వం బీజేపీ మాత్రమే అన్నారు. అనంతరం దేశ రక్షణకోసం పనిచేసిన గ్రామంలోని ఎనిమిది మంది మాజీ సైనికులను ఘనంగా సన్మానించారు. మాజీ సైనికులు, బీజేపీ కార్యకర్తలు మురళీధర్, గురుబ్రహ్మం, గంగాధర్ స్వాతి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గోస్పాడు: బీజేపీతోనే దేశం అన్ని రంగాలలో పురోగాభివృద్ధి సాధించిందని మండల బీజేపీ కన్వీనర్ తలారి మధుగోపాల్ అన్నారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా శనివారం గోస్పాడులో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధికి సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం వచ్చిన తరువాత దేశం ఆర్థికంగా, రక్షణ రంగంలో సర్వతోముఖాభివృద్ధి సాధించిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. మాజీ సర్పంచ్ నక్క నాగేష్, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

14న వసంత పంచమి

కొత్తపల్లి, ఫిబ్రవరి 10: కొలనుభారతి పుణ్యక్షేత్రంలోని జ్ఞాన సరస్వతి అమ్మవారి పుట్టిన రోజు వేడుకలు ఈనెల 14 బుధవారం మాఘశుద్ధ పంచమి రోజున అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మోహన్, ధర్మకర్త మండలి చైర్మన్ వెంకటనాయుడు తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ కొత్తపల్లి మండలంలోని నల్లమల్ల అటవీ ప్రాంతంలో వెలసిన చదువులతల్లి వసంత పంచమి వేడులకు బుధవారం తెల్లవారు జాము నుంచి ప్రారంభం అవుతున్నట్లు తెలిపారు. ఉదయం 5.30 గంలకు శ్రీశైలం దేవస్థానం నుండి తెచ్చిన పట్టువస్త్రాలతో అమ్మవారి అలంకారం ఉంటుందన్నారు. అలాగే అమ్మవారికి మహన్యాస పూర్వక ఏకవార అభిషేకాలు, సహస్రనామ కుంకుమార్చన, పుష్పార్చన, మహా మంగళ హారతి, అలాగే చిన్నారులకు అక్షరాభ్యాస క్రతువులు సప్త శివాలయాలలో అభిషేకాలు తదితర పూజాది క్రతువులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకలను పురస్కరించుకొని ఆత్మకూరు నుంచి కొలనుభారతి క్షేత్రానికి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

జగన్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత

● శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి ● టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న బుడ్డా రాజశేఖరరెడ్డి



టీడీపీలో చేరిన పలువురు మహిళలు

శ్రీశైలం, ఫిబ్రవరి 10: జగన్ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. శ్రీశైలం మండలంలో గత మూడు రోజులుగా బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి పర్యటించి వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాల గురించి ప్రజలకు వివరించారు. ఈ క్రమంలో సున్నిపెంట, లింగాలగట్టుకు చెందిన సుమారు వైసీపీకి చెందిన వంద కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. బుడ్డా రాజశేఖరరెడ్డి వారికి కండువా వేసి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. బాబు అధికారంలోకి వస్తేనే ప్రజల కష్టాలు తీరుతాయని, రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని పేర్కొన్నారు. ఐదేళ్ల ఏళ్ల వైసీపీ పాలనతో రాష్ట్రం దేశంలోనే అభివృద్ధి చెందడంలో వెనకపడిందన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలకు ఒరిగిందేమీ లేదని, రాష్ట్ర భవిష్యత్తునే ప్రశ్నార్థకంగా మార్చారని ఆయన ఆరోపించారు. ప్రత్యేకించి అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించడమే కాకుండా ప్రజలపై అధిక పన్నుల భారం వేసి ఇబ్బందులకు గురిచేస్తోందని మండిపడ్డారు. వైసీపీ దుర్మార్గ పాలనతో రాష్ట్రం అన్ని విధాలుగా నష్టపోయిందన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ప్రజలకు భరోసా ఇచ్చేందుకే లోకేశ్ శంఖారావం'

ఆత్మకూరు: రాష్ట్ర ప్రజలకు భరోసా ఇచ్చేందుకే ఈనెల 11 నుంచి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం పర్యటనకు శ్రీకారం చుట్టారని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల యువగళం పాదయాత్ర ద్వారా నారా లోకేశ్ ప్రజల కష్టాలను తెలుసుకున్నారన్నారు. అయితే యువగళం పాదయాత్రను అడ్డుకునేం దుకు కుట్రలు చేసి తమనేత చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని దుయ్యబట్టారు. అన్ని నియోజకవర్గాలకు వెళ్లి ప్రజల కష్టాలను తెలుసుకుని వారికి భరోసా ఇచ్చేందుకే శంఖారావం పర్యటనలకు శ్రీకారం చుట్టారన్నారు. సుమారు 40 నుంచి 50 రోజుల పాటు యువగళం పాదయాత్ర జరగని నియోజకవర్గాలే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాల్లో పర్యటిస్తారన్నారు. ప్రజల కష్టాలను తెలుసుకోవడమే కాకుండా వైసీపీ దుర్మార్గాలను, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేలా ప్రజల్ని చైతన్య వంతుల్ని చేయనున్నట్లు వివరించారు. అంతేకాదు.. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రవేశపెట్టబోయే మహాశక్తి పథకాల గురించి కూడా ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. అలాగే ఆయా నియోజకవర్గాలతో కార్యకర్తలమే మమేకమై వారి కష్టాలను కూడా తెలుసుకుని పార్టీ అధికారంలోకి వస్తే కార్యకర్తల సంక్షేమానికి దృష్టి సారించేందుకు ముందుకొస్తున్నట్లు వివరించారు. వైసీపీని తరిమికొట్టడమే ప్రధాన లక్ష్యంగా జరుగుతున్న నారా లోకేశ్ శంఖారావం కార్యక్రమానికి అన్నివర్గాల ప్రజలు మద్దతు తెలిపి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వాసవీ మాతకు కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 10: నంద్యాల మెయిన్ బజార్‌లో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆత్మార్పణ దినోత్సవాల్లో భాగంగా శనివారం వాసవీమాత ఆలయంలో కుంకుమార్చన నిర్వహించారు. నంద్యాల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి శ్రీనివాస ఆధ్వర్యంలో వాసవీమాతకు బంగారు కిరీటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వాసవీ మహిళా మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి: ఎస్టీయూ




మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మౌలాలి

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 10: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు మౌలాలి డిమాండ్ చేశారు. నంద్యాలలోని ఎస్టీయూ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన సీపీఎస్ రద్దు హామీ ఇప్పటివరకు నెరవేర్చకపోవడంపై సీఎం జగన్ ఉద్యోగ, ఉపాధ్యాయులను స్పష్టంగా మోసం చేశారని మండిపడ్డారు. ఉద్యోగులు తమ అవసరాలకు దాచుకున్న భవిష్యనిధి సొమ్ము, లీవ్ ఎన్‌క్యాష్ మెంట్ డబ్బులను, పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయుల చెల్లింపులను ఇంతవరకు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోపాలకృష్ణ, రామిరెడ్డి, సోమయ్య, మనోహర్‌రెడ్డి, ప్రభాకర్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాలు ప్రారంభం

వెలుగోడు, ఫిబ్రవరి 10: వెలుగోడు మండలంలో శనివారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పర్యటించారు. బోయరేవుల, గుంతకందాలలో రైతు భరోసా కేంద్రాలను, రేగడగూడూరులో గ్రామ సచివాలయం, హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలు, ప్రారంభించారు. అనంతరం రేగడగూడూరు నుంచి పెసరవాయి గ్రామానికి నూతన రోడు నిర్మాణం ప్రారంభ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఎంపీపీ లాలం రమేశ్, సర్పంచ్ జయపాల్, నాయకులు, అంబాల ప్రభాకరరెడ్డి, తిరిపెంరెడ్డి, భాస్కరరెడ్డి, జనాభరెడ్డి, రామిఇరెడ్డి, నాగేశ్వరరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అలరించిన నిత్య కళారాధన



నృత్యం చేస్తున్న కళాకారులు

శ్రీశైలం, ఫిబ్రవరి 10: శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో శనివారం విశాఖపట్నానికి చెందిన దర్పణ నాట్య అకాడమీ బృందంతో సంప్రదాయ నృత్యప్రదర్శన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఆలయ దక్షిణ మాడ వీధిలోని నిత్య కళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమంలో మహాగణపతిం, లింగాష్టకం, శివపంచాక్షరీ, శివతాండవస్తోత్రం తదిత గీతాలకు శివచైత్ర, గ్రీష్మ, శ్రీలక్ష్మీగౌరి తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

ముగిసిన రెండో విడత పార్వేట



ఎస్.లింగందిన్నెలో పూజలందుకుంటున్న అహోబిలేశుడు

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 10: మండలంలోని ఎస్.లింగందిన్నెలో అహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ పల్లకీ రెండో విడత పార్వేట శనివారం 10వ తేదీతో ముగిసింది. గత నెల 30వ తేదిన ఆళ్లగడ్డ మండలంలోని బాచ్చా పురం మెట్ట నుంచి రెండో విడత ఉత్సవ పల్లకీ పర్యటన ప్రారంభమైంది. మండలంలో ఉత్సవ పల్లకి 13 రోజుల పాటు బాచ్చాపురం, నాగిరెడ్డిపల్లె, పడకండ్ల, ఆళ్లగడ్డ, ఎస్.లింగందిన్నె గ్రామాల్లోని తెలుపుల వద్ద పల్లకి విడిది చేయడంతో గ్రామాల ప్రజలు పల్లకీలోని జ్వాలా నరసింహ స్వామికి, ప్రహ్లాద వరదస్వామికి భక్తి శ్రద్ధలతో పూజలు చేసి కానుకలు సమర్పించుకున్నారు. మూడో విడత పార్వేట ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభమవుతుంది.

'వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం'



భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 10: రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఒక్క చాన్స్ అంటూ అధికారంలోకి వచ్చారని, అయితే వైసీపీ పాలనలో సర్వనాశనం చేశారని టీడీపీ సీనియర్ నాయకుడు, 38వ వార్డు ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు అన్నారు. 38వ వార్డు వైఎస్సార్‌నగర్‌లో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం వార్డులో ఇంటింటికి తిరిగి టీడీపీ మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ వచ్చిన జగన్మోహన్‌రెడ్డిని రాష్ట్రం నుంచి తరిమేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేసి రాష్ట్రంలోని సంపదను దోచుకొని దాచుకోవడంతో ప్రజలు అన్ని గమనిస్తున్నారన్నారు. టీడీపీ సూపర్‌సిక్స్ పథకాలకు పేదరికం లేని సమాజాన్ని నిర్మించడమే చంద్రబాబు లక్ష్యమన్నారు. గడప గడపతో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ప్రజలు నిర్మొహమాటంగా చెప్పారని, వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. తాటికొండ మహేష్, టీడీపీ నాయకులు, మహిళలు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

మహానంది, ఫిబ్రవరి 10: మండలంలోని గోపవరం గ్రామానికి చెందిన షేక్ చిన్న మదార్‌షా(70) చికిత్స పొందుతూ మృతి చెందారు. మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ శనివారం తెలిపిన వివరాలివి.. మదార్‌షా ఈనెల 7వ తేదీన తన ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. కుటుంబ సభ్యులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. వృద్ధుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'రహదారి సూత్రాలు అతిక్రమిస్తే చర్యలు'



ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ

వెలుగోడు, ఫిబ్రవరి 10: డ్రైవర్లు రహదారి సూత్రాలు పాటించాలని, లేకపోతే చర్యలు తప్పవని ఆత్మకూరు సీఐ నాగభూషణ్ హెచ్చరించారు. శనివారం వెలుగోడు పోలీస్ స్టేషన్ ఆవరణలో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రయాణికులను క్షేమంగా గమ్యానికి చేర్చాలని సూచించారు. ప్రతి వాహన దారుడు లైసెన్స్ కల్గి ఉండాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. పరిమితికి మించి ప్రయాణికులను, అధిక బరువులు కలిగన వస్తువులను తరలించరాదని అన్నారు. డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ మాట్లాడవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ భూపాలుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



భక్తులకు ప్రసాదాలను అందజేస్తున్న అధికారి

శ్రీశైలం, ఫిబ్రవరి 10: శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శనివారం హైదరాబాద్‌కు చెందిన బి. శ్రీనివాస్ అనే భక్తుడు రూ. లక్ష విరాళాన్ని, ఏలూరుకు చెంది గాజుల విజయ రూ.లక్ష విరాళాన్ని వేవస్థానం అధికారులకు అందజేశారు. దాతకు దేవస్థానం అధికారులు స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.



భక్తులకు ప్రసాదాలను అందజేస్తున్న అధికారులు

మోడల్ పుస్తకాల పంపిణీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న వేగా ఫౌండేషన్ ప్రతినిధులు వెంకటరాముడు, నాగరాజు

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 10: గురుకుల ప్రవేశ పరీక్ష రాయబోతున్న 5వ తరగతి విద్యార్థులకు నగరంలోని వేగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మోడల్ పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. శనివారం బి.క్యాంపులో జరిగిన కార్యక్రమంలో వేగా ఫౌండేషన్ అధ్యక్షుడు బి. వెంకటరాముడు, ప్రధాన కార్యదర్శి బి.నాగరాజు ఆధ్వర్యంలో ప్రవేశ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల వివరాలు సేకరించి, విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి వాటిని అందజేశారు. ఈ మోడల్ పుస్తకాలు గురుకుల ప్రవేశ పరీక్షలు రాసే ఐదో తరగతి విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని వారు అన్నారు. పేద విద్యార్థులకు గురుకులాల్లో ప్రవేశాలు లభించేలా వారికి ఈ మోడల్ పుస్తకాలు అందజేశామని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, అధికారులు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 10: జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాలను పోలీస్ అధికారులు పరిశీలించినట్లు ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి తెలిపారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాలను శనివారం పోలీస్ అధికారులు, సిబ్బంది పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల భౌగోళిక పరిస్థితులు, స్థానిక పరిస్థితులు తదితర వాటిపై నివేదిక ఇవ్వాలని ఎస్పీ ఆదేశించిన నేపథ్యంలో అధికారులు పోలింగ్ కేంద్రాల బాట పట్టారు. ఈ మేరకు పోలీస్ అధికారులు రెవెన్యూ సిబ్బందితో కలిసి పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను సంబంధిత ఎస్ఐతో పాటు రెవెన్యూ సిబ్బంది వెళ్లి పరిశీలించారు. ఈ మేరకు వారు పోలింగ్ కేంద్రాల్లోని సౌకర్యాలు, భవనాలు, పరిసరాలను పరిశీలించి అక్కడ పోలింగ్ సజావుగా సాగేందుకు అవసరమైన అంశాలను స్వయంగా పరిశీలించారు. అలాగే రూట్‌మ్యాప్‌ను కూడా పరిశీలించారు. సౌకర్యాలు లేని పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పన కోసం ఉన్నతాధికారులకు నివేదికలు సమర్పించనున్నట్లు ఎస్పీ తెలిపారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం



టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

వెలుగోడు, ఫిబ్రవరి 10: రోడ్డు ప్రమాదంలో గాయపడిన టీడీపీ కార్యకర్త మహేష్‌గౌడ్‌కు టీడీపీ మండల అధ్యక్షుడు అన్నారపు శేషిరెడ్డి ఆర్థిక సాయం అందించారు. శనివారం వెలుగోడు పట్టణంలోని మహేష్‌గౌడ్‌కు ఆయన వెల్డింగ్ షాపు వద్ద నగదును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ అబ్దుల్ కలాం, రఘుస్వామిరెడ్డి, శంకర్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, శ్రీనివాసులు, వెంకటరామిరెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మహానందిలో సినీ హాస్య నటుడు పృథ్వీరాజ్



మహానందిలో సినీ హాస్య నటుడు పృథ్వీరాజ్

మహానంది, ఫిబ్రవరి 10: మహానంది క్షేత్రంలో సినీ హాస్య నటుడు, జనసేన నాయకుడు పృథ్వీరాజ్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పృథ్వీరాజ్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన పొత్తుతో రాష్ట్రంలో దుర్మార్గపు పాలన అంతమవుతుందని అన్నారు. ఉమ్మడి పొత్తుతో భవిష్యత్తుకు నాంది అని అన్నారు. ప్రస్తుతం తాను రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న గేం ఛేంజర్ సినిమాతో పాటు రజనీకాంత్ జైలర్-2లో ప్రాధాన్యత గల పాత్రలు పోషిస్తున్నట్లు తెలిపారు. తెలుగు చిత్రపరిశ్రమలో క్యారెక్టర్ ఆర్టిస్టుల కొరత తగ్గిందన్నారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో రైల్వే జీఎం



రైల్వే జనరల్ మేనేజర్‌కు స్వామి మెమొంటో అందజేస్తున్న ఈవో

మహానంది, ఫిబ్రవరి 10: మహానంది క్షేత్రంలో శనివారం రైల్వే జనరల్ మేనేజర్ జీకే ద్వివేది ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయం ముఖమంటపం వద్ద అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో రైల్వే జీఎం కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లకు అభిషేకార్చనలు నిర్వహించారు. ఆలయం ప్రాంగణంలోని కల్యాణ మంటపంలో వీరిని ఆలయ వేదపండితులు ఆశీర్వదించారు. ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి శాలువాతో సన్మానించి, స్వామి మెమొంటోను అందచేశారు. వీరి వెంట గుంతకల్లు డీఆర్ఎం యోగీంద్ర ప్రతాపసింగ్ ఉన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

పాములపాడు, ఫిబ్రవరి 10: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం నిర్వహించారు. శనివారం స్థానిక శివాలయం ఆవరణలో పాములపాడు మండలం విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు సత్యనారయణ గుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వీహెచ్‌పీ గ్రామ సేవకులు, రామసేన సమ్మేళన కార్యక్రమంలో ఆత్మకూరు ప్రఖండ విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు సుదర్శన్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ అయోధ్యలోని బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా గ్రామాలలో వివిధ రకాల సేవలు చేసిన వివిధ గ్రామాల శ్రీ రాముడి కార్యకర్తలను సన్మానించారు. బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాలుపంచుకొన్న వారిని అభినందించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

ముగిసిన రెండో విడత పార్వేట



ఎస్.లింగందిన్నెలో పూజలందుకుంటున్న అహోబిలేశుడు

ఆళ్లగడ్డ, ఫిబ్రవరి 10: మండలంలోని ఎస్.లింగందిన్నెలో అహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఉత్సవ పల్లకీ రెండో విడత పార్వేట శనివారం 10వ తేదీతో ముగిసింది. గత నెల 30వ తేదీన ఆళ్లగడ్డ మండలంలోని బాచ్చాపురం మెట్ట నుంచి రెండో విడత ఉత్సవ పల్లకి పర్యటన ప్రారంభమైంది. మండలంలో ఉత్సవ పల్లకి 13 రోజుల పాటు బాచ్చాపురం, నాగిరెడ్డిపల్లె, పడకండ్ల, ఆళ్లగడ్డ, ఎస్.లింగందిన్నె గ్రామాల్లోని తెలుపుల వద్ద పల్లకి విడిది చేయడంతో గ్రామాల ప్రజలు పల్లకిలోని జ్వాలా నరసింహ స్వామికి, ప్రహ్లాద వరదస్వామికి భక్తి శ్రద్ధలతో పూజలు చేసి కానుకలు సమర్పించుకున్నారు. మూడో విడత పార్వేట ఈ నెల 12వ తేదీ నుంచి ప్రారంభమవుతుంది.

మద్దిలేటి స్వామి ఆదాయం రూ.4.81లక్షలు

బేతంచెర్ల, ఫిబ్రవరి 10: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులో వెలసిన మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రం ఆదాయం రూ. 4.81 లక్షలు లభించినట్లు ఆలయ ఈఓ పాండురంగారెడ్డి, ఛైర్మన్ సీతారామచంద్రుడు శనివారం తెలిపారు. స్వామి సేవ టికెట్లు, లడ్డు ప్రసాదం, కేశఖండన రూములో బాడుగలు లీజుల వసూళ్ల ద్వారా రూ. 4,81,160 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు.

బకాయిలు చెల్లించాలి: ఎస్టీయూ

చాగలమర్రి, ఫిబ్రవరి 10: ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే చెల్లించాలని ఎస్టీయూ మండల అధ్యక్షుడు మస్తాన్‌వలి, కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి మహబూబ్‌హుసేన్ డిమాండ్ చేశారు. శనివారం చాగలమర్రి ఎస్టీయూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలన్నారు. 1వ తేదీన జీతాలు చెల్లించాలని, పీఎఫ్, పీఆర్సీ బకాయిలు, సరెండర్ లీవ్‌లు, తదితర ఆర్థిక బకాయిలు చెల్లించి ఉపాధ్యాయులను ఆదుకోవాలని కోరారు. ఉపాధ్యాయులపై కక్షసాధింపు ధోరణి విడనాడాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు శివశంకర్, ప్రసాదు, నారాయణరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ఉస్మాన్, మహబూబ్‌బాషా, శ్రీనివాసులు, శేషాద్రి, నరసింహులు, సురేషప్ప పాల్గొన్నారు.

'రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలి'

చాగలమర్రి, ఫిబ్రవరి 10: మండలంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని తహసీల్దార్ రమణమ్మ సూచించారు. శనివారం చాగలమర్రి గ్రామంలోని సచివాలయాలను తనిఖీ చేశారు. సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ 2,600 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారని, వారందరికి రిజిస్ట్రేషన్‌లు చేస్తారని చెప్పారు. 17 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ కార్యక్రమం ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. వీఆర్వోలు శ్రీనివాసులు, శారద ఉన్నారు.

రక్తదానం చేయండి



రక్తదానం చేస్తున్న సభ్యులు

కోవెలకుంట్ల ఫిబ్రవరి 10: ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోవెలకుంట్ల ఆర్టీసీ డిపో మేనేజర్ తిరుపతయ్య అన్నారు. శనివారం రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా కోవెలకుంట్ల బస్టాండు ఆవరణలో డిపో మేనేజర్ తిరుపతయ్య, డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రి వారి సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 27 మంది రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డిపో సిబ్బంది, ట్రాఫిక్ సూపర్‌వైజర్, సెక్యూరిటీ సిబ్బంది, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

'పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'



చిన్నకంబలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న పోస్టల్ అధికారులు

రుద్రవరం, ఫిబ్రవరి 10: పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ మౌళీశ్వర్‌రెడ్డి సూచించారు. మండలంలోని చిన్నకంబలూరు గ్రామంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో భాస్కర్‌రావు, రెడ్డిరాజు, బాలన్న, శ్రీరామచంద్రరావు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి బీసీ పరామర్శ



టీడీపీ నాయకుడు మద్దిలేటిని పరామర్శిస్తున్న బీసీ జనార్దన్‌రెడ్డి

కోవెలకుంట్ల ఫిబ్రవరి 10: మండలంలోని అమడాల గ్రామానికి చెందిన బనగానపల్లె నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అభిరుచి మద్దిలేటిని శనివారం మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి పరామర్శించారు. మద్దిలేటి బైక్ ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి అమడాలలోని మద్దిలేటిని ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆయన వెంట కాటిరెడ్డి, మల్లికార్జున రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు అమడాల మద్దిలేటి ఉన్నారు.

వైసీపీని ప్రజలు నమ్మరు: జనసేన

డోన్(రూరల్), ఫిబ్రవరి 10: వైసీపీని మరోసారి ప్రజలు నమ్మరని డోన్ జనసేన నాయకులు ఆలా మోహన్‌రెడ్డి, రాయల్ మల్లి అన్నారు. శనివారం జనసేన నాయకులు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ మరోసారి ప్రజలను మోసం చేసేందుకు వైసీపీ నాయకులు ప్రజల వద్దకు వస్తున్నారని, వారిని నమ్మి మోసపోయేందుకు ప్రజలు సిద్ధం లేరని అన్నారు.

ప్రభుత్వ విధానాలతో కుదేలైన నాపరాయి పరిశ్రమ

» మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 10: వైసీపీ ప్రభుత్వ విధానాలతో నాపరాయి పరిశ్రమ కుదేలయిందని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి విమర్శించారు. కొలిమిగుండ్ల మండలంలోని గొర్విమానుపల్లె గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బీసీ పాల్గొన్నారు. బీసీకి మండల టీడీపీ కన్వీనర్ మూలే రామేశ్వర్‌రెడ్డి, హుసేన్‌రెడ్డి, రత్నమయ్య, జనసేన పార్టీ నాయకులు స్వాగతం పలికారు. బీసీ ఇంటింటికీ తిరిగి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా బీసీ మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. దేశంలో 11 శాతం నిరుద్యోగులు ఉండగా ఏపీలో 24 శాతం నిరుద్యోగులున్నారని అన్నారు. వైసీపీ ఎన్నికల హామీలో భాగంగా ఏటా మెగా డీఎస్సీ, ప్రతి ఏటా జనవరిలో జాబ్ క్యాలెండరు, 2.32 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ ఏమైందో సీఎం జగన్ సమాధానం చెప్పాలన్నారు. ఏపీలో 1745 మంది నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. టీడీపీ రాష్ట్రాన్ని పెట్టుబడులకు హబ్‌గా మారిస్తే వైసీపీ గంజాయిహబ్‌గా మార్చిందని విమర్శించారు. గతంలో ఎన్నికల సమయంలో కాటసాని రామిరెడ్డి బందార్లపల్లె వద్ద ఉన్న చెక్‌పోస్టును ఎత్తివేస్తానని నమ్మించి ఓట్లు వేసుకున్నారన్నారు. గెలిచిన తర్వాత కొట్టంలో ఉన్న రాయల్టీ చెక్‌పోస్టుకు భవనం నిర్మించి అధిక రాయల్టీ వసూలు చేస్తున్నారని విమర్శించారు. టీడీపీ హయంలో చదరపు అడుగుకు రాయల్టీ రూ.8లునుంచి రూ.5లకు అలాగే 30 శాతం ఉన్న డీఎంఎఫ్‌ను10 శాతం తగ్గించామన్నారు. వైపీ ప్రభుత్వం రాయల్టీని పెంచిందని అలాగే డెడ్ రెంట్‌ను హెక్టారుకు రూ.40వేల నుంచి రూ.52వేలకు పెంచిందన్నారు. నాపరాయి పరిశ్రమకు భారీ పరిశ్రమలకు ఉన్న కండీషన్లు పెట్టి మైనింగ్ ఓనర్లకు నరకం చూపిస్తున్నారన్నారు. ఒక హెక్టారుకు సెక్యూరిటీ డిపాజిట్ మూడింతలు పెంచి రూ.156,000 వసూలు చేస్తోందని విమర్శించారు. డెడ్ రెంట్‌ను రాయలీ కింద వాడుకోకుండా మైనింగ్ యజమానులకు ఆర్థికంగా ఇబ్బంది పెడుతుందని విమర్శించారు. గని యజమానులను వైసీపీ ప్రభుత్వం వేధిస్తుండంతో అనేక నాపరాయి గనులను మూసివేశారని, దీంతో కార్మికులకు ఉపాధి కరువైందన్నారు.

బీసీ సమక్షంలో టీడీపీలో చేరిక : కొలిమిగుండ్ల మండలం దళవాయిపల్లె గ్రామానికి చెందిన పది వైసీపీ కుటుంబాలు వైసీపీని వీడి శనివారం మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. గొర్విమానుపల్లె గ్రామంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమానికి హాజరైన బీసీ సమక్షంలో దళవాయిపల్లె గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మల్నే రామిరెడ్డి, గజ్జల రామిరెడ్డి, నరసింహారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, హనుమంతరెడ్డితోపాటు మరో పది కుటుంబాలకు చెందిన వైసీపీ నాయకులకు బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు మూలెరామేశ్వర్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి కోటపాటు శివరామిరెడ్డి, తెలుగుయువత అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నంద్యాల ప్రసాద్, టైలర్ వెంకటరముడు, బొట్టుస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీకి గుణపాఠం తప్పదు: మాజీ మంత్రి

శిరివెళ్ల: అక్రమాలు, దౌర్జన్యాలు చేసే వారిని ప్రజలు ఆదరించరని, వచ్చే ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం తప్పదని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. మండలంలోని యర్రగుంట్ల గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మినీ మేనిఫెస్టో పత్రాలను ప్రజలకు అందజేశారు. అఖిలప్రియ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోరే టీడీపీ వైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రజా ప్రయోజనాలను గాలికొదిలేసి ప్రజాప్రతినిధులు జేబులు నింపుకునేందుకే పని చేశారని ఆరోపించారు. ప్రజల్లోకి వెళ్లి ఓట్లు అడిగే అర్హత వైసీపీ నాయకులు కోల్పోయారన్నారు. వైసీపీ నేతల అక్రమాలను భరించలేకే సొంత పార్టీ నాయకులు స్వచ్ఛందంగా టీడీపీలో చేరుతున్నారని ఆమె అన్నారు. టీడీపీ మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ-2 కమతం జయరామిరెడ్డి, కమతం పుల్లారెడ్డి, కమతం లక్ష్మిరెడ్డి, సత్తారు లక్ష్మిరెడ్డి, సుబ్బారెడ్డి, మురళి, యామా గుర్రప్ప, సూరా రామ, శీలం లక్ష్మీప్రసాద్, శీలం రామ్మోహన్, మండ్ల హుసేనప్ప, విజయ్ కుమార్, జమాల్ బాషా, బుగ్గన్న, మద్దిలేటి, జాకీర్ హుసేన్, పీపీ లింగమయ్య, ఉల్లి వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరిక

ఆళ్లగడ్డ: రాష్ట్రంలోని ప్రజలు వైసీపీ ప్రభుత్వం వల్ల ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకే శంఖారావం కార్యక్రమాన్ని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ చేపడుతున్నారని మాజీ మంత్రి అఖిలప్రియ, ఆమె భర్త భార్గవ్‌రామ్‌నాయుడు తెలిపారు. ఆళ్లగడ్డ మండలంలోని కోటకందుకూరు గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ చాంద్‌బాషా ఆధ్వర్యంలో ఆ గ్రామానికి చెందిన వంద ముస్లిం కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. పట్టణంలోని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ సమక్షంలో శనివారం ఆమె స్వగృహంలో చేరారు. అఖిలప్రియ మాట్లాడుతూ ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం యాత్రకు శ్రీకారం చుట్టారని అన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే రాయలసీమలో పరిశ్రమలు వస్తాయని, యువతకు ఉపాధి, ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు. లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రకు మంచి స్పందన వచ్చిందని, శంఖారావం యాత్ర కూడా విజయవంతం అవుతుందని అన్నారు. టీడీపీలో చేరిన కోటకందుకూరు ముస్లింలు బీబీ, జాఫర్‌వలి, మాహున్ని, అమ్మిరానా, హజిరా ఉన్నారు.

అప్పుల పాలనకు చరమగీతం పాడుదాం: సుబ్బారెడ్డి

ప్యాపిలి: వైసీపీ అప్పుల పాలనకు చరమగీతం పాడుదామని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి పిలుపు నిచ్చారు. పట్టణంలోని 6,7 వార్డుల్లో శనివారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ అప్పులతో పబ్బం గడుపుతున్న జగన్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందంటే సిగ్గు చేటని ఎద్దేవా చేశారు. సంక్షేమం పేరుతో వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని తాకట్టు పెడుతుందని సుబ్బారెడ్డి విమర్శించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రానికి చంద్రబాబు సేవలు అవసరమని అన్నారు. కార్యక్రమంలో డోన్ మార్కెట్ యార్డు మాజీ చెర్మన్ మురళీక్రిష్ణగౌడు, నాయకులు ఆర్ఈ రాఘవేంద్ర, చిన్నసుంకయ్య, గండికోట రామసుబ్బయ్య, ఎర్రగుంట్లపల్లి వెంకటేశ్వరరెడ్డి, రామ్మోహన్‌యాదవ్, చల్లా వీరాంజినేయులు, మధు కుమార్, ప్రసాద్‌రెడ్డి, సుదర్శన్, ఖాజాపీర్, అంకిరెడ్డి, ఎస్ మధు, నాగేంద్ర, బూరుగుల గంగరాజు, మౌలాలిరెడ్డి, జనసేనా నాయకులు పాల్గొన్నారు.

'అరాచక పాలనకు పతనం తప్పదు'

దొర్నిపాడు: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు పతనం తప్పదని టీడీపీ నాయకుడు భూమా జగత్ విఖ్యాతరెడ్డి అన్నారు. శనివారం దొర్నిపాడు గ్రామం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో గురించి వివరించారు. జగత్ విఖ్యాతరెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి జరగలేదని, టీడీపీ అధికారంలోకి వస్తేనే ప్రజలకు సంక్షేమ ఫలాలు, గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందని అన్నారు. విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబును సీఎంగా గెలిపించుకుందామని కోరారు. కార్యక్రమంలో తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు సద్ది సత్యనారాయణ, మల్లేశ్వరచౌదరి, అమరసాని రవి, చలుంగారి అంకన్న యాదవ్, మాజీ సర్పంచ్ సిద్ధి నారాయణ, జిల్లా సుబ్బరాయుడు, లింగుట్ల వెంకట్‌నాయుడు, ఎండూరి గోపాల్, దయానందరావు, అమరసాని తేజ, నిమ్మకాయల వెంకట్రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

టీడీపీతోనే పేదల సంక్షేమం

చాగలమర్రి: టీడీపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు అన్నారు. శనివారం చాగలమర్రి గ్రామంలో బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మ్యానిఫెస్టోను పంపిణీ చేసి సూపర్-6 పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సీమాంధ్ర బీసీ సంఘం మండల అధ్యక్షుడు మహబూబ్‌బాషా, టీడీపీ నాయకులు రామసుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, సయ్యద్ బషీర్, కె.రమేష్, రమణ, మహబూబ్‌బాషా, అబ్బాస్, మాబు, మహిళలు పాల్గొన్నారు.



బీసీ జనార్దన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు



టీడీపీలో చేరిన కోటకందుకూరు గ్రామస్థులతో భూమా అఖిలప్రియ



ప్యాపిలిలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న ధర్మవరం సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు



దొర్నిపాడులో భూమా జగత్ విఖ్యాతరెడ్డి



చాగలమర్రిలో..

పునాదుల్లోనే పనులు

రుద్రవరం, ఫిబ్రవరి 10: రుద్రవరం మండలంలో ఆర్‌బీకేలు, వెల్‌నెస్ కేంద్రాల నిర్మాణాలు పునాదులతోనే నిలిచాయి. తిరిగి అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల తరువాత నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వం నుంచి అధికారులకు ఆదేశాలు అందాయి. ఒక్కో రైతు భరోసా కేంద్రానికి రూ.21,80 లక్షలు, ఒక్కో వెల్‌నెస్ కేంద్రానికి రూ.17.50 లక్షలు ప్రభు త్వం కేటాయించింది. వెల్‌నెస్ కేంద్రాలకు ఇప్పటి వరకు పెట్టిన పెట్టుబడి ఎన్నికల తరు వాత కూడా అందే పరిస్థితి లేదు. ఎందుకంటే ఎన్నికల తరువాతనే నిర్మాణాలు చేపట్టాలంట.

రుద్రవరం మండలంలో ఇలా.. రుద్రవరం మండలంలో పేరూరు గ్రామంలో ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రం, శ్రీరంగాపురం గ్రామంలో ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రం, యల్లావత్తుల గ్రామంలో ఆర్‌బీకే, పెద్దకంబలూరులో ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రం, నాగలవరంలో ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రం, రుద్రవరంలో ఆర్‌బీకేలు 2, వెల్‌నెస్ కేంద్రాలు 2, మందలూరులో ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రం పునాదుల్లోనే నిర్మాణలు నిలిచిపోయాయట.

ఎన్నికల తరువాతే నిర్మాణాలు: రైతు భరోసా, వెల్‌నెస్ కేంద్రాల నిర్మాణ పనులు పునాదుల్లో నిలిచాయి. తిరిగి ఎన్నికల తరువాత వీటి నిర్మాణాలు చేపట్టాలని ఆదేశాలు అందాయి. ఇకపై పునాదుల్లో ఉన్న ఏ భవనాన్ని కూడా నిర్మాణం చేపట్టొద్దు అన్న ఆదేశాలు అందాయి. ఇక ఈ భవన నిర్మాణాలు పునాదులకే పరిమితమా? తిరిగి ఎన్నికల తరువాత నిర్మిస్తారో లేదో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



రుద్రవరం మండలం పేరూరులో పునాదుల్లోనే నిలిచిన వెల్‌నెస్ కేంద్రం

ఆ భవనాల నిర్మాణాలు తరువాత చేపడతాం

పునాదుల్లో ఉన్న రైతు భరోసా, వెల్‌నెస్ కేంద్రాలు తరువాత నిర్మించాలని ఆదేశాలు అందాయి. అందుకే వాటి నిర్మాణాలు ప్రస్తుతం నిలుపుదల చేశాం. రూఫ్ లెవల్ ఉన్న వాటిని మాత్రమే నిర్మాణాలు చేపట్టాలని ఆదేశాలు ఉన్నాయి. వాటిని నిర్మించి ప్రజలకు అందుబాటులో తెస్తాం.

– వెంకటరాముడు, ఏఈ, పీఆర్, రుద్రవరం



చాగలమర్రిలో ఆగిన ఆర్‌బీకే భవనం

చాగలమర్రి: చాగలమర్రిలో రైతు భరోసా కేంద్రాలు పునాదులకే పరిమితమయ్యాయి. నాలుగేళ్లైన ఆర్‌బీకే భవనాలు పూర్తి కాకపోవడంతో ఆర్బీకేలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. భవనాలు లేకపోవడంతో ఒకే అద్దె భవనంలో మూడు కేంద్రాలను నిర్వహిస్తున్నారు. వ్యవసాయ కార్యాలయం వద్ద ఉన్న ప్రభుత్వ భవనంలో రెండు ఆర్‌బీకే భవనాలను నిర్వహిస్తున్నారు. భవన పనులు పూర్తి కాకపోవడంతో వ్యవ సాయ సిబ్బంది, అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికా రులు స్పందించి భవన పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

రుద్రవరం, ఫిబ్రవరి 10: మండలంలోని వాసాపురం బాలాలయంలో వేంకటేశ్వరస్వామికి , శివలింగం, పార్వతీదేవికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అలాగే వేంకటేశ్వరస్వామి లక్ష్మీగోదాదేవి అమ్మవారు, మానస లింగేశ్వరస్వామి త్రిపుర సుందరీదేవి అమ్మవార్లకు అర్చకులు వారణాసి గోపిశర్మ, శివశర్మ అభిషేకం చేసి వేద మంత్రోచ్చరణల మధ్య పూజలు ప్రారంభించారు. భక్తులు లక్ష కుంకుమార్చన చేశారు. అనంతరం స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అల్పాహారం ఏర్పాటు చేశారు.

జీర్ణోద్ధరణ పనులు ప్రారంభం: మండలంలోని ఆలమూరు గ్రామంలో ఆలయాల దీనావస్థ, గుప్త నిధుల దాడుల్లో దెబ్బతిన్న దేవతా విగ్రహాలు అనే శీర్షికతో 2023 జూన్ 21న వార్త ప్రచురితమైంది. దేవదాయశాఖ అధికారులు అప్పట్లో నివేదికలు పంపడంతో నిధులు మంజూరయ్యాయి. ఆలమూరు చెన్నకేశవస్వామి ఆలయంలో శనివారం ఈవో జయచంద్రరెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. అనంతరం దెబ్బతిన్న లక్ష్మీ నరసింహస్వామి, చెన్నకేశవస్వామి విగ్రహాలు పెకలించి పక్కన బెట్టారు. అలాగే ధ్వజస్తంభాన్ని తొలగించారు. కొత్త విగ్రహాల ఏర్పాటు చేస్తున్నట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఛైర్మన్ దంపతులు పాల్గొన్నారు.

నరసింహ స్వామి ఆలయాల్లో పూజలు: మండలంలోని నరసాపురం, రుద్రవరం గ్రామంలోని దొర్వి, గుట్టకొండ నరసింహస్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు.

ఆంజనేయ స్వామికి..

చాగలమర్రి: చాగలమర్రిలోని వీరాంజనేయస్వామి ఆలయంలో ఆంజనేయ స్వామికి మాఘ మాసం సందర్భంగా శనివారం వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మహిళలు సామూహికంగా తమలపాకులతో పూజలు చేశారు. భజన కార్యక్రమాలు, పల్లకీ ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు లక్ష్మణబాబు, కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



వాసాపురంలో వేంకటేశ్వరస్వామికి పూజలు చేస్తున్న భక్తులు



చాగలమర్రిలో ఆంజనేయస్వామికి పూజలు చేస్తున్న మహిళలు

ఓపీఎస్ అమలు చేసే పార్టీకే మా ఓటు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు

ప్యాపిలి, ఫిబ్రవరి 10: ఓపీఎస్ అమలు చేస్తామని హామీ ఇచ్చే పార్టీకే తమ ఓటు వేస్తామని యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు క్రిష్ణానాయక్ అన్నారు. శనివారం మండలంలోని ఏనుగమర్రి ప్రభుత్వ పాఠశాలలో యూటీఎఫ్ నాయకులు ఓపీఎస్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా క్రిష్ణానాయక్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో పార్టీ నేతలు మాయ మాటలు చెప్పి ఉద్యోగ, ఉపాధ్యాయులు దగా చేస్తున్నారని విమర్శించారు.

సీపీఐ నాయకుల అరెస్టు దారుణం



సీపీఐ నాయకులను అరెస్టు చేసిన ఎస్ఐ శివశంకర్

బేతంచెర్ల, ఫిబ్రవరి 10 : ప్రభుత్వం నిరుద్యోగులను తక్షణమే మెగా డీఎస్సీ ప్రకటించాలని చేపట్టిన సీఎం కార్యాలయ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరాల్సిన వారిని ముందస్తుగా అరెస్టు చేయడం దారుణమని సీపీఐ మండల నాయకులు భార్గవ్ అన్నారు. శనివారం సీపీఐ నాయకులు ఉదయ్, భాస్కర్, ఎల్లక్రిష్ణలను అరెస్టు చేసి నిర్బంధించారన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

చాగలమర్రి, ఫిబ్రవరి 10: మండలంలోని చిన్నవంగలి, చింతలచెరువు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రమణమ్మ శనివారం తనిఖీ చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, మరుగుదొడ్లు, భవనాల పైకప్పు, ర్యాంపులను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులపై దృష్టి సారించాలని సెక్టోరల్ అధికారులకు సూచించారు. 52 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, ఆయా కేంద్రాల్లో మౌలిక వసతులపై నివేదికలు సమర్పించాలని అన్నారు. ఆమె వెంట వీఆర్వోలు ఉన్నారు.

టైలర్స్ ఆసోసియేషన్ అధ్యక్షుడిగా అహ్మద్ హుసేన్



కోవెలకుంట్ల, ఫిబ్రవరి 10: కోవెలకుంట్ల పట్టణంలోని టీడీపీ మద్దతుదారులైన టైలర్స్ ఆసోసియేషన్ అధ్యక్షుడిగా అహ్మద్ హుసేన్‌ను నాలుగోసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టైలర్ల సంఘం ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించగా అహ్మద్ హుసేన్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడూతూ తనపై నమ్మకంతో నాలుగోసారి కూడా ఎన్నుకున్నందుకు టైలర్లకు కృత జ్ఞతలు తెలిపారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

చాగలమర్రి, ఫిబ్రవరి 10: చాగలమర్రిలోని బుగ్గ వీధి రహదారిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో న్యామతుల్ల శనివారం పరిశీలించారు. నాణ్యత గల కోడిగుడ్లు, భోజనం ఇవ్వాలని ఏజెన్సీ మహిళలకు సూచించారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలన్నారు. అనంతరం విద్యార్థుల వర్క్‌బుక్కులను, గ్రేడింగ్‌ను పరిశీలించారు. కార్యక్ర మంలో హెచ్ఎం వరలక్ష్మి ఉన్నారు.